సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం, 21, ఆగస్టు, 2023



ఎల్‌ఎండీకి మిడ్‌మానేరు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులోకి ఎస్సారెస్పీ నుంచి 4,500, వరద ఇన్‌ఫ్లో 1500 క్యూసెక్కుల మేర ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది.



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్న ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇల్లు కూల్చేస్తున్నారని ప్రాణాలు తీసుకున్నారు

- పురుగుల మందుతాగి వృద్ధ దంపతుల ఆత్మహత్య
- చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లిలో విషాదం




దేవయ్య, లక్ష్మీనర్సవ్వ మృతదేహాలు

చందుర్తి (వేములవాడ) : ఏళ్ల తరబడి ఉంటున్న ఇల్లును పెద్ద కుమారుడు, కోడలు కూలగొడుతున్నారని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఆశిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఆశిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కనికరపు దేవయ్య(69), లక్ష్మీనర్సవ్వ(60) దంపతులకు ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రవీందర్, కోడలు మణెమ్మ ఇల్లును కూల్చివేస్తామని, ఇంట్లోంచి వెళ్లిపోవాలని వృద్ధ దంపతులతో గొడవ పడుతున్నారు. కాగా తాము ఉన్నన్ని రోజులు ఇల్లును కూల్చవద్దని రవీందర్‌తో వాదించారు. శనివారం ఇంటిని కూల్చివేసే క్రమంలో రవీందర్‌తో మరోసారి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన దేవయ్య, లక్ష్మీనర్సవ్వ ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రవీందర్, మణెమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

'మా మద్దతు రమేశ్‌బాబుకే..'



సంగీత నిలయంలో రమేశ్‌బాబుకు మద్దతు ప్రకటిస్తున్న స్థానిక నాయకులు

వేములవాడ: ఎమ్మెల్యే రమేశ్‌బాబుకే తమ మద్దతు ఉంటుందని, రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్‌ఎస్ టికెట్ రమేశ్‌బాబుకే ఇవ్వాలని నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సంగీత నిలయంలో ఆదివారం సమావేశమైన వీరు ఈమేరకు అధిష్టానానికి విన్నవించారు. వారు మాట్లాడుతూ గతంలోనే సీఎం కేసీఆర్ సిట్టింగులకే టిక్కెట్లు ఇస్తామని ప్రకటించిన మాటపై ఉండాలని కోరారు. 23 నాడు వేములవాడకు చేరుకోనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయవర్గాలు వెల్లడించాయి. రమేశ్‌బాబుకు మద్దతుగా పార్టీ నాయకులు సత్తిరెడ్డి, పుల్కం రాజు, గోస్కుల రవి, మల్యాల దేవయ్య, మేకల ఎల్లయ్య, దయాల కమలాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జగిత్యాల జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, జెడ్పీటీసీలు నాగం భూమయ్య, గట్ల మీనయ్య, మేకల రవి, ఏశ వాణి, ఎంపీపీలు జవ్వాజి రేవతి, గంగం స్వరూప, బూర వజ్రవ్వ, ఎదురుగట్ల చంద్రయ్య, బైరగోని లావణ్య, కౌన్సిలర్లు, ఏఎంసీ చైర్మన్లు తదితరులు హాజరయ్యారు.

కరాటేలో ప్రతిభ

వేములవాడ: వేములవాడలోని పద్మశాలీ సంఘం భవనంలో ఆదివారం జరిగిన ఒకటో రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో వేములవాడకు చెందిన 13 మంది విద్యార్థులు పాల్గొనగా 9 మంది రాష్ట్ర స్థాయి పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ గగ్గూరి దివ్య తెలిపారు. విఘ్నేశ్, ఆర్ణవ్, సిద్ధాంత్, లోమిత్, అశ్రిత, త్రిషక, సహస్ర, నక్షత్ర, మన్విత, రోష్ని పతకాలు సాధించారు. వీరిని గ్రాండ్ మాస్టర్ అమిత్, మాస్టర్ శ్రీనివాస్ అభినందించారు.

సెలవు పూట.. పోరుబాట



దీక్ష శిబిరంలో మాజీ సర్పంచులు

సిరిసిల్లటౌన్: మాజీ సర్పంచులు సెలవు రోజైన ఆదివారం సైతం పోరుబాట పట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 12వ రోజు రిలేదీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ తాము నిరవధిక రిలేదీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బొడ్డు దేవయ్య, సంపునూరి మల్లేశంగౌడ్, అలువాల లక్ష్మణ్, దేవుని నర్సయ్య, రాజమల్లు పాల్గొన్నారు.

నేడు గద్దర్ సంస్మరణ సభ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సిరిసిల్లలోని వాసవి కల్యాణ మండపంలో ఈనెల 21న గద్దర్ సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు తెలిపారు. తంగళ్లపల్లిలో ఆదివారం వివిధ సంస్థల ప్రతినిధులతో కలిసి గద్దర్ సంస్మరణ సభ పోస్టర్ ఆవిష్కరించారు. సభకు ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి, విమలక్క పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాములు, కిశోర్, ఎల్లప్ప, సాయికుమార్, నాగరాజు పాల్గొన్నారు.

'సెస్'లో ఇంటి దొంగలు

- సంస్థ ఖజానాకు కన్నం
- సంస్థకు డబ్బులు చెల్లించకుండానే విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు
- ఏఈతోపాటు ఏడుగురు సస్పెన్షన్
- ఆదేశాలు జారీ చేసిన మేనేజింగ్ డైరెక్టర్
- అంతకుముందే సీనియర్ అసిస్టెంట్, అసిస్టెంట్ హెల్పర్‌పై వేటు
- చందుర్తి, రుద్రంగి మండలాల్లో భారీ అక్రమాలు
- కొనసాగుతున్న విచారణ



సిరిసిల్ల 'సెస్' ఆఫీస్ భవనం

సిరిసిల్ల: జిల్లాలో విద్యుత్ పంపిణీ సేవలందించే సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)లో భారీ అక్రమాలు జరిగాయి. సంస్థకు ఎలాంటి డబ్బులు చెల్లించకుండానే, వర్క్‌ఆర్డర్లు లేకుండానే విద్యుత్‌లైన్లు వేసి, ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి, విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేశారు. సంస్థ సిబ్బందే ఇంటిదొంగలుగా మారి పాలకవర్గ సభ్యుడితో చేతులు కలిపి ఖజానాకు కన్నం వేశారు. చందుర్తి, రుద్రంగి మండలాల్లో భారీ అక్రమాలు వెలుగు చూడడంతో సెస్ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ మండల అసిస్టెంట్ ఇంజినీర్‌తో పాటు లైన్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు లైన్‌మెన్లను, ఇద్దరు అసిస్టెంట్ హెల్పర్లను, ఒక్క అసిస్టెంట్ లైన్‌మెన్‌ను సస్పెండ్ చేశారు. ఇదే ఘటనలో ఇప్పటికే ఒక్క సీనియర్ అసిస్టెంట్‌ను, మరో అసిస్టెంట్ హెల్పర్‌ను సస్పెండ్ చేశారు. తాజాగా మరో ఏడుగురిని సస్పెండ్ చేస్తూ విధుల నుంచి తప్పించడం కలకలం సృష్టించింది. 50 ఏళ్ల సెస్ చరిత్రలో ఇంత మందిని ఒకేసారి సస్పెండ్ చేయడం ఇదే తొలిసారి. తాజా అక్రమాల ఘటన సంస్థను కుదిపేసింది.

ఏం జరిగిందంటే..

చందుర్తి మండల పరిధిలో విద్యుత్‌లైన్లను, విద్యుత్ కనెక్షన్లను నిబంధనల మేరకు సెస్ సంస్థకు నిర్దిష్ట మొత్తాన్ని చెల్లించకుండా నేరుగా కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై కొత్త కరెంట్ లైన్లు వేశారు. సంస్థ రికార్డుల్లోకి ఎక్కకుండానే నేరుగా వినియోగదారుల వద్ద డబ్బులు దండుకుని కనెక్షన్లు ఇచ్చేశారు. సెస్ గత పాలకవర్గంలో సభ్యుడిగా ఉన్న డైరెక్టర్‌తో చేతులు కలిపి, సంస్థకు డబ్బులు చెల్లించకుండానే పనులు చేశారు. రూ.లక్షల్లో సెస్ సంస్థకు జమకావాల్సిన డబ్బులు కాంట్రాక్టర్, సిబ్బంది జేబుల్లోకి వెళ్లాయి.

ఎలా బయట పడిందంటే..

చందుర్తి మండలంలో పనిచేసే రాజు అనే అసిస్టెంట్ హెల్పర్ విద్యుత్ వినియోగదారుల వద్ద డబ్బులు తీసుకుని సంస్థకు చెల్లించకుండానే కనెక్షన్ ఇచ్చారు. వినియోగదారుడికి నకిలీ రశీదు అందించాడు. ఆ నకిలీ రశీదుకు సంబంధించిన నగదు సెస్ ఖజానాలో జమకాలేదు. వినియోగదారుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన సెస్ అధికారులు నాలుగు నెలల కిందట అసిస్టెంట్ హెల్పర్ యెన్నం రాజయ్య(రాజు)ను సస్పెండ్ చేసి గోప్యంగా ఉంచారు. ఈ నేపథ్యంలో మరిన్ని ఫిర్యాదులు రావడంతో మళ్లీ విచారణ చేపట్టి, చందుర్తిలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ ఎం.కార్తీక్ ప్రమేయం ఉన్నట్లు, ఇదే తరహాలో భోగస్ రశీదులు ఇచ్చినట్లు గుర్తించారు. దీంతో కార్తీక్‌ను కూడా 'సెస్' మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ రెండు నెలల కిందట సస్పెండ్ చేశారు. దీనిపై మరింత లోతుగా విచారణ చేయడంతో డొల్లతనం వెలుగులోకొచ్చింది. చందుర్తిలో సెస్ డైరెక్టర్ ఒత్తిడి మేరకు భారీ ఎత్తున అక్రమాలు జరిగినట్లు రుజువైంది.

ఏడుగురి సస్పెన్షన్

సెస్ సంస్థ ఖజానాకు భారీ ఎత్తున కన్నం పడినట్లు ఆలస్యంగా గుర్తించిన 'సెస్' ఉన్నతాధికారులు అప్పటి చందుర్తి ఏఈ స్రవంతి(ప్రస్తుతం తంగళ్లపల్లి ఏఈ), చందుర్తి లైన్ ఇన్‌స్పెక్టర్ కె.బ్రహ్మయ్య(సిరిసిల్లటౌన్-1), రుద్రంగి లైన్‌మెన్ జి.రాజశేఖర్ (నిమ్మపల్లి), లింగంపేట లైన్‌మెన్ జి.రవీందర్(తిమ్మాపూర్), సనుగుల, జోగాపూర్ అసిస్టెంట్ లైన్‌మెన్ టి.దేవయ్య, జోగాపూర్ విలేజీ ఎలక్ట్రికల్ వర్కర్ టి.తిరుపతి (ప్రస్తుతం అసిస్టెంట్ హెల్పర్‌గా వేములవాడలో ఉన్నాడు), మల్యాల అసిస్టెంట్ హెల్పర్ జి.రమేశ్‌లను సస్పెండ్ చేశారు. మొత్తం ఏడుగురిని విధుల నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో సస్పెండ్ అయిన ఇద్దరితో కలిపితే మొత్తం తొమ్మిది మందిని తొలగించారు.

> ### సెస్‌కు నష్టం చేసినట్లు నిర్ధారణ అయింది
>
> 
>
> చందుర్తి మండలంలో నిబంధనలు పాటించకుండా 'సెస్' సంస్థకు నష్టం చేసినట్లు నిర్ధారణ అయింది. విచారణ నివేదిక ఆధారంగానే ఏడుగురిని సస్పెండ్ చేశాము. సంస్థలో పనిచేస్తూ తప్పులు జరిగితే గుర్తించకుండా ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వకుండా తప్పులను కప్పిపుచ్చితే ఎవరిపైనా అయినా చర్యలు తీసుకుంటాం. చందుర్తిలో పనిచేసిన ఏడుగురిని సస్పెండ్ చేసింది నిజమే.
>
> – ఎస్.రామకృష్ణ, 'సెస్' మేనేజింగ్ డైరెక్టర్, సిరిసిల్ల

లక్కీడ్రాప్ ఎవరికో?

- నేడు తేలనున్న వ్యాపారుల భవితవ్యం
- గతంకన్నా భారీగా పెరిగిన దరఖాస్తులు
- 290షాపులకు 10,730 దరఖాస్తులు
- అత్యధికంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో..



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వైన్‌షాపుల లక్కు ఎవరిని వరిస్తుందోనని మద్యం వ్యాపారుల్లో టెన్షన్ మొదలైంది. లాటరీ ద్వారా ఎంపికకు మరికొద్ది గంటల సమయమే ఉంది. ఈక్రమంలో దీనిపై చర్చ జోరుగా సాగుతోంది. ఈసారి దరఖాస్తు ఫీజు రూ.2లక్షలుగా నిర్ణయించారు. దీంతో భారీమొత్తం చెల్లించి కొందరు ఒకటికి మించి షాపులకు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 290వైన్స్‌లకు గతంలో 5,215 దరఖాస్తులు రాగా ఈసారి వాటి సంఖ్య 10,730కు చేరాయి. శుక్రవారం రాత్రి వరకూ క్యూలైన్‌లో ఉండి.. మరీ పోటీ పడి వ్యాపారులు దరఖాస్తు చేశబూరు. వైన్స్‌ల కోసం దరఖాస్తులు అందించిన వారి గెజిట్ నంబర్ల ప్రకారం డ్రా తీసేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కలెక్టర్ల స్వీయ పర్యవేక్షణలో షాపుల వారీగా లక్కీ డ్రా తీయనున్నారు. గతం కన్నా రెట్టింపుస్థాయిలో దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అయితే, ధరావత్తు రూ.2లక్షలు చెల్లించి దాఖలు చేసిన దరఖాస్తుదారులకు వైన్స్ దక్కకుంటే పరిస్థితి ఏమిటనే ప్రశ్న అందరిలోనూ మొదలైంది. గ్రూపుల వారీగా ఏకమై.. సిండికేట్‌గా మారి ఎవరికి వైన్స్ వచ్చినా ఉమ్మడిగా దరఖాస్తుల సొమ్ము జమచేసి షాపులు నడిపించుకుందామనే ఒప్పందానికి వచ్చారు.

290 మద్యం దుకాణాలు.. 10,730 దరఖాస్తులు

వైన్స్‌లకు అందిన దరఖాస్తులు

జిల్లా	షాపులు	గతం	ప్రస్తుతం
పెద్దపల్లి	77	1080	2,022
కరీంనగర్	94	1720	4,040
సిరిసిల్ల	48	944	2,032
జగిత్యాల	71	1471	2,636
మొత్తం	290	5,215	10,730

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 290 వైన్స్‌లకు 10,730 దరఖాస్తులు వచ్చాయి. గతంలో ఇవే షాపులకు 5,215 దరఖాస్తులు మాత్రమే అందాయి. గతంలో కన్నా రెట్టింపు స్థాయిలో దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

సిండికేట్‌కు సిద్ధమైన వ్యాపారులు

ఈసారి దరఖాస్తులతోపాటు రూ.2లక్షల ఫీజు చెల్లించాల్సి రావడంతో ఒక్కో బృందం బారీగా దరఖాస్తులు సమర్పించాయి. దీంతో లక్కీడ్రాపై గంటగంటకూ ఉత్కంఠ పెరిగిపోతోంది. షాపుల వారీగా డ్రా వేసి దరఖాస్తుదారులను ఏకంచేసి ఎవరికి దుకాణం దక్కినా.. అందరూ కలిసి షాప్ ఏర్పాటు చేసుకునే ఒప్పందంలో అందరూ బిజీగా ఉన్నారు.

నాలుగు జిల్లాల్లో లక్కీ డ్రా వేదికలు ఇవే..

పెద్దపల్లి జిల్లాలో..

పెద్దపల్లి పట్టణ శివారులోని బందంపల్లి స్వరూప గార్డెన్‌లో వైన్స్‌ల లక్కీడ్రా తీసేందుకు ఎక్సైజ్ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. షాపుల వారీగా వచ్చిన దరఖాస్తులను బట్టి డ్రాలో నంబర్లు వేయనున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ డ్రా తీసిన ప్రకారం.. షాపులు కేటాయించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 77 షాపులకు 2,022 మంది దరఖాస్తు చేయగా, వారి సమక్షంలోనే సోమవారం ఉదయం 10.30గంటల నుంచి డ్రా తీస్తారు.

కరీంనగర్ జిల్లాలో..

కరీంగనగర్ జిల్లాలో 94 షాపులకు 4,040 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ గోపి ఆధ్వర్యంలో లక్కీడీప్ ద్వారా వైన్స్ కేటాయిస్తారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సిరిసిల్ల జిల్లాలో..

రాజన్న సిరిసిల్ల కలెక్టర్ ఆడిటోరియంలో లక్కీడ్రా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 48 షాపులకు 2,032 దరఖాస్తులు రాగా గెజిట్ నంబర్ల ప్రకారం కలెక్టర్ అనురాగ్ జయంతి ఆధ్వర్యంలో లక్కీడీప్ ద్వారా వైన్స్ కేటాయిస్తారు.

జగిత్యాల జిల్లాలో..

జగిత్యాల జిల్లాలోని విరూపాక్షి గార్డెన్‌లో మద్యం షాపుల లక్కీ డ్రా తీస్తారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాటు చేసింది. జిల్లాలోని మొత్తం 71 షాపులకు 2,636 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా తీసి దుకాణాలు కేటాయిస్తారు.

'గృహలక్ష్మి' ఇంటింటి సర్వేలు

- తుది దశకు చేరిన విచారణ
- జిల్లాలో 82 శాతం పూర్తి
- దరఖాస్తుదారుల్లో 68.5 శాతం అర్హులు



మండలం బొప్పాపూర్‌లో రేకుల షెడ్డు ముందు అధికారుల విచారణ

సిరిసిల్ల: జిల్లాలో గృహలక్ష్మి పథకంలో ఇంటి నిర్మాణానికి దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఇంటింటి సర్వేలు తుది దశకు చేరాయి. ఆదివారం సెలవు దినమైనప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 22,127 మంది గృహలక్ష్మి దరఖాస్తు చేసుకోగా 6,300 ఇళ్ల మంజూరయ్యాయి. దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో విచారణ చేపడుతున్నారు. ఇప్పటి వరకు మొత్తం 18,094 ఇళ్లకు వెళ్లి అధికారులు వివరాలు సేకరించారు. ఇందులో 12,399 మంది అర్హులుగా తేలారు. జిల్లాలో మొత్తం దరఖాస్తుదారుల్లో ఇప్పటికే 82 శాతం క్షేత్రస్థాయి సర్వే పూర్తికాగా.. ఇందులో 68.5 శాతం మంది అర్హులుగా తేలారు. ఒకటి, రెండు రోజుల్లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ఆన్‌లైన్‌లో అర్హుల జాబితాను అప్‌లోడ్ చేస్తారు. ఈనెల 25వ తేదీ నుంచి అర్హులకు కలెక్టర్ అనుమతితో మహిళల పేరిట గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లు జారీకానున్నాయి. ముస్తాబాద్, వీర్నపల్లి, వేములవాడ మున్సిపాలిటీ, వేములవాడఅర్బన్ ప్రాంతాల్లో వంద శాతం సర్వేలు పూర్తయ్యాయి. 69.7 శాతంతో చందుర్తి మండలం సర్వేలో వెనకబడింది.

ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టాలి

- సీఎం, పీఎంలు అబద్ధాలాడుతుండ్రు
- తెలంగాణ ఇచ్చిన సోనియాను మరువొద్దు
- ఏఐసీసీ సెక్రటరీ క్రిష్టఫర్ తిలక్



సిరిసిల్లలో మాట్లాడుతున్న క్రిష్టఫర్

సిరిసిల్లటౌన్: తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలని కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులకు ఏఐసీసీ కార్యదర్శి క్రిష్టఫర్ తిలక్ కోరారు. సిరిసిల్లలోని డీసీసీ ఆఫీసులో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలిచే అవకాశాలున్నాయని ఇందుకు స్థానిక నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులే రాష్ట్రాన్ని గుత్తాధిపత్యాన్ని చేపట్టారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ అనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకున్నారని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వారు బలంగా నిలబడుతారని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇద్దరు తెలంగాణ సంక్షేమంపై అబద్ధాలు వల్లిస్తున్నారని విమర్శించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ..సిరిసిల్లలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా పనిచేయాల్సిన సమయం వచ్చిందన్నారు. కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కామని వనిత, ముఖ్య నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, ఆడెపు చంద్రకళ, శ్రీపెరంబుదూరు రమాదేవి, నేరెళ్ల శారద, సంగీతం శ్రీనాథ్, వెంగల అశోక్ ఉన్నారు.

'చల్మెడ' ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన నాయకులు


కథలాపూర్/మేడిపెల్లి(వేములవాడ): జగిత్యాల జిల్లా భీమారం, మేడిపెల్లి మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నేత చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. న్యాయవాది తన్నీరు శ్రీనివాస్‌రావు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు భూమరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వంగ వెంకటేశం, దేశాయిపేట, రాజలింగంపేట, కమ్మరిపేట, దమ్మన్నపేట, మాచపూర్, వల్లంపెల్లి, కొండాపూర్, కట్లకుంట, కాచారం, ఒడియాడ్, కల్వకోట, విలయతాబాద్ అభిలాష్, నారాయణ, సురేశ్, బుడుత జయశ్రీ,, ఆదె లక్ష్మీరాజం, మహేశ్ తదితరులు హాజరయ్యారు. వీరితోపాటు ఎంపీటీసీలు పల్లి అర్జున్, భూమేశ్, రవి, రాజేశ్వర్, లోలపు రెడ్డి, ఆదే రాజంతోపాటు విజయ, అంకం సాగర్, సురేందర్‌రావు తదితరులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. అయితే, చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు వేములవాడ టికెట్ వస్తుందనే ఆశతో వీరంతా ఆత్మీయ సమ్మేళనానికి హాజరైనట్లు తెలిసింది. రెండు మండలాలకు చెందిన సుమారు 200మందికిపైగా బీఆర్‌ఎస్ శ్రేణులు ఆత్మీయ సమ్మేళనానికి హాజరవడం జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీసింది. కాగా, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు విదేశీ పర్యటనలో ఉండగా ఆత్మీయ సమ్మేళనం జరగడం రాజకీయ పరంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు.. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు కథలాపూర్‌లోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వేములవాడ టికెట్ చల్మెడ లక్ష్మీనర్సింహారావుకే వస్తుందనే సంకేతాలు వస్తున్నాయని, అందుకే ఆయనకు మద్దతుగా ఈ సమావేశం నిర్వహించామని కొందరు నాయకులు తెలిపారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గాలు ఖరారు


- ఫలించిన ఎదురుచూపులు
- పార్టీ విధేయులకే అందలం




ఎలుసాని మోహన్ బొప్పాపూర్ చైర్మన్




బందారపు బాల్‌రెడ్డి వైస్‌చైర్మన్



హన్మంతరెడ్డి గంభీరావుపేట చైర్మన్



గుజ్జుల రాజిరెడ్డి, వీర్నపల్లి చైర్మన్



సిరిసిల్ల గాంధీచౌక్‌లో అక్కరాజు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

సిరిసిల్ల/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/ముస్తాబాద్/వీర్నపల్లి(సిరిసిల్ల): జిల్లాలోని ఆరు మార్కెట్ కమిటీల పాలకవర్గాలను ప్రకటించారు. కమిటీ చైర్మన్లను శనివారం రాత్రి ప్రకటించగా.. పూర్తిస్థాయి పాలకవర్గాలను ఆదివారం వెల్లడించారు. పార్టీ విధేయులకే అవకాశాలు దక్కాయి. ఎలాంటి పదవి లేకున్నా ఏళ్లుగా పార్టీ వెన్నంటే ఉండి, అభివృద్ధికి కృషి చేసిన నాయకులకు అందలం ఎక్కించారు.

సిరిసిల్ల మార్కెట్ కమిటీ: చైర్మన్‌గా పూసపెల్లి సరస్వతి, వైస్‌చైర్మన్‌గా బండారి శ్యాంచందర్, డైరెక్టర్లుగా బైరి రమేశ్, సద్ది రోజా, వంగ తిరుపతిరెడ్డి, బూర్గుపల్లి మల్లేశం, పెంజర్ల మల్లయ్య, శ్యాగ దేవేందర్, సింగరవేణి తిరుపతి, షేక్ అలీ, కంది భాస్కర్‌రెడ్డి, ఉప్పుల లక్ష్మారెడ్డి, జూపల్లి రఘునందన్‌రావు, కట్కం శ్రీనివాస్.

ఎల్లారెడ్డిపేట మార్కెట్ కమిటీ: చైర్మన్‌గా ఎలుసాని మోహన్‌కుమార్, వైస్ చైర్మన్‌గా బందారపు బాల్‌రెడ్డి, డైరెక్టర్లుగా గంట బాలాగౌడ్, బొమ్మనవేని సత్యం, ఇప్ప దేవేందర్‌రెడ్డి, బోనాల శ్రీధర్, నమిలికొండ నర్సింలు, తాడ ప్రతాప్‌రెడ్డి, మేడిశెట్టి శ్రీనివాస్, గోగూరి శ్రీనివాస్, జంగా నర్సారెడ్డి, ట్రేడర్లుగా బండ సతీశ్, మెండే శ్రీనివాస్‌యాదవ్.

పోతుగల్ మార్కెట్ కమిటీ : చైర్మన్‌గా అక్కరాజు శ్రీనివాస్, వైస్‌చైర్మన్‌గా నాగుల శ్రీనివాస్, డైరెక్టర్లుగా అనమేని సునంద, ముక్క మల్లయ్య, కొత్తపల్లి నారాయణ, జూకంటి ప్రమోద్‌రావు, దేవదాస్, రామారావు, బొమ్మెన ఆంజనేయులు, ముష్కం దేవయ్య, జింక మల్లేశ్, దుద్దెడ రాజు, ట్రేడర్‌లుగా నందెల్లి గోపాల్‌రావు, హన్మంత్‌రెడ్డి.

వీర్నపల్లి మార్కెట్ కమిటీ: చైర్మన్‌గా గుజ్జుల రాజిరెడ్డి, వైస్‌చైర్మన్‌గా భూక్య తులసీరామ్, డైరెక్టర్లుగా ఆకుల సత్యం, గంట దేవరాజు, భూక్య ధర్‌సింగ్, భూక్య రాజు, పొన్నం దేవరాజు, కడవ లచ్చయ్య, గంగాధరి రాజు, లోకుర్తి లక్ష్మి, గుగులోతు రమేశ్, బండి మహేందర్, బండ సుదర్శన్, దప్పుల లింగం.

గంభీరావుపేట ఏఎంసీ కార్యవర్గం : చైర్మన్‌గా కొత్తింటి హన్మంతరెడ్డి, వైస్‌చైర్మన్‌గా గోగు లింగంయాదవ్, డైరెక్టర్లుగా నిరంజని, అభిలాశ్, లక్ష్మీనారాయణ, గోవింద్, నర్సయ్య, రహమత్ అలీ, లింగం, దేవయ్య, దేవాగౌడ్, దేవయ్య, రేణికింది నాగరాజు, పాపారావు.

'అక్కరాజు'కు అభినందనల వెల్లువ

సిరిసిల్ల: ముస్తాబాద్ మండలం పోత్గల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అక్కరాజు శ్రీనివాస్ నియామకంపై సిరిసిల్ల రజక సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గాంధీచౌక్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన అక్కరాజు శ్రీనివాస్‌ను సన్మానించారు. దుబ్బాక రమేశ్, మడేల్ దేవయ్య, దండు శ్రీనివాస్, మహేందర్, బండి శ్రీనివాస్, కాసర్ల శ్రీనివాస్, విక్రమ్, బండి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు


తడగొండలో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

బోయినపల్లి: (చొప్పదండి): రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. వస్తున్నా మీ సేవకై కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని తడగొండ, మల్కాపూర్ గ్రామాల్లో గడప గడపకూ కాంగ్రెస్ పల్లె పల్లెకూ సత్యమన్న కార్యక్రమం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో తడగొండ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, భీంరెడ్డి మహేశ్ రెడ్డి, నాయకులు పులి లక్ష్మీపతి, కొడగాని వెంకటేశ్, ఎండీ. హుస్సేన్, బోయిని ఎల్లేశ్, దయ్యాల రాజశేఖర్, ఏనుగుల ప్రశాంత్, రఫీ, రమేశ్, వినోద్, లచ్చయ్య తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలు

సిరిసిల్ల టౌన్: జిల్లా కేంద్రంలోని మెహెర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో సిరిసిల్ల వికాస తరంగిణి, ఆరోగ్య వికాస్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యులు డాక్టర్ హరికిషన్, ప్రదీప్ రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి సుమారు 400 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జాగీరు శైలు, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్ గౌడ్, వికాస తరంగిణి నాయిని మంగ, ఆరోగ్య వికాస్ కో ఆర్డినేటర్ మాదిరెడ్డి అంజనాదేవి, నరహరి, పెద్ది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అరవై శాతం టికెట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లఅర్బన్: జనాభాలో అధికశాతం ఉన్న బీసీలకు అన్ని పార్టీలు అరవై శాతం టికెట్లు కేటాయించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిగా ప్రకటించాలని, లేకపోతే వచ్చేనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే బీసీ గర్జనలో బీసీ రాజకీయ పార్టీ ప్రకటిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు వంగ కృష్ణగౌడ్, రాజేశ్, పార్తు నిశాంత్, వినయ్, అజయ్, హర్షవర్ధన్, ప్రణీత్‌గౌడ్, రాజు తదితరులున్నారు.


చిన్నబోనాలలో పేలుడు పదార్థాల పట్టివేత

- జిలెటెన్ స్టిక్స్ స్వాధీనం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాలలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు లభించడం ఆదివారం కలకలం రేపింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొన్నాళ్ల క్రితం ఇతర ప్రాంతం నుంచి చిన్నబోనాలకు వలస వచ్చిన ఓ కుటుంబం ఇక్కడే ఉంటూ బండలు కొడుతూ బతుకుతున్నారు. జిల్లా పోలీసులు ఆదివారం మధ్యాహ్నం వారి ఇంటిపై దాడి చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన దాదాపు వందకు పైగా జిలెటిన్‌స్టిక్స్ దొరికినట్లు తెలిసింది. నిందితున్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

రక్షణ దళంలోకి రైతు బిడ్డలు

- ఒకే గ్రామం నుంచి ఇద్దరు ఎంపిక
- ఫలించిన యువ ఫౌండేషన్ శిక్షణ
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు


యువకులకు శిక్షణ ఇస్తున్న రాజశేఖర్

వేములవాడరూరల్: తమలాగా కష్టపడొద్దంటూ ఆ రైతులు తమ కొడుకులను చదివించారు. నేడు రక్షణ దళంలో ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోతోంది. ప్రభుత్వం జనవరిలో రక్షణదళంలో ప్రవేశం కోసం పరీక్ష నిర్వహించగా ఆదివారం ఫలితాలు వెలువడిన ఫలితాల్లో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు రక్షణ దళంలో ఉద్యోగం సాధించడంతో వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫలించిన ఫౌండేషన్ శిక్షణ

వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గొడిశెల రాజశేఖర్ యువ ఫౌండేషన్ పేరుతో యువకులకు రోజు ఉద్యోగంపై మెళకువలు నేర్పుతూ శిక్షణనిస్తున్నాడు. శిక్షణలో మండలం నుంచే ఇతర గ్రామాల నుంచి యువకులు శిక్షణ పొందుతున్నారు. ఇప్పటికే శిక్షణ తీసుకున్న పలువురు యువకులు వివిధ రంగాల్లో ఉద్యోగం సాధించగా ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన గడ్డం వంశీ, రేపాక శివకుమార్‌తో పాటు ముస్తాబాద్ మండలం బద్దనకల్‌కు చెందిన చింతాకుల రాకేశ్ ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. రాజశేఖర్ వద్దే శిక్షణ తీసుకోవడంతో రక్షణదళంలోకి ఎంపికైనట్లు వారు పేర్కొన్నారు.

ఒకే గ్రామం నుంచి ఇద్దరు

మండలంలలోని ఫాజుల్‌నగర్ నుంచి ఇద్దరు యువకులు ఒకేసారి రక్షణ దళంలో ఎంపికవడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో గ్రామంలోని గడ్డం వంశీ, రేపాక శివకుమార్ ఎంపికకాగా వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు వారిని అభినందించారు. ఎస్సై ఫలితాల్లో కూడా వట్టెంల నుంచి మొగిలి కార్తీక్ అనే యువకుడు ఎంపికవడం విశేషం.

సీఆర్పీఎఫ్‌కు మల్కపేట యువకుడి ఎంపిక



కోనరావుపేట: మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన వేల్పుల అంజయ్య–నాగవ్వ కుమారుడు విజయ్ సీఆర్పీఎఫ్‌కు ఎంపికయ్యాడు. సీఆర్పీఎఫ్‌కు ఎంపికైన విజయ్‌ను స్నేహితులు విజయ్, ఉపేందర్, ఆదిత్య, గ్రామస్తులు అభినందించారు.

ఐదోసారి ఉద్యోగం సాధించా



నేను గతంలో వివిధ ఉద్యోగాల కోసం నాలుగు సార్లు పరీక్షలు రాశాను. కానీ తక్కువ మార్కుల తోనే ఉద్యోగం కోల్పోయాను. ఐదోసారి పరీక్షలు రాయగా అస్సాం రైఫిల్‌లో ఎంపికయ్యారు. యువ ఫౌండేషన్‌లో తీసుకున్న శిక్షణ ఎంతో ఉపయోగపడింది.

– రేపాక శివకుమార్, ఫాజుల్‌నగర్

శిక్షణ దోహదపడింది



యువ ఫౌండేషన్‌లో శిక్షణలో రాజశేఖర్ చెప్పిన మోటివేషన్ ఎంతగానో ఉపయోగపడింది. ఆయన ఇచ్చిన మెలకువతోనే నేడు బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించాను. నాతో పాటు చాలా మంది యువకులకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది.

– గడ్డం వంశీ, ఫాజుల్‌నగర్

ఆనందంగా ఉంది



కొన్నేళ్లుగా అందిస్తున్న శిక్షణతో చాలామంది యువకులకు వివిధ రంగాల్లో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. రక్షణ దళంలో నా వద్ద శిక్షణ తీసుకున్న ముగ్గురు యువకులు మెరిట్ సాధించారు.

– గొడిశెల రాజశేఖర్, యువ ఫౌండేషన్ నిర్వాహకుడు

ఔట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి


గర్జనలో ఐక్యత చూపుతున్న ఉద్యోగులు

- రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గర్జనలో జేఏసీ నేతల డిమాండ్

కొత్తపల్లి(కరీంనగర్): రాష్ట్రంలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గర్జన నిర్వహించారు. పలువురు నేతలు మాట్లాడుతూ.. అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కీలకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వీఆర్‌ఏ, వీఆర్వో, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ, సెర్ప్ ఉద్యోగుల మాదిరిగానే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. మూడేళ్ల కాలపరిమితి పూర్తయిన ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తక్షణమే రెగ్యులర్ చేయాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, మరణించిన వారి కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థికసాయం, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జేఏసీ నేతలు లక్ష్మయ్య, రాజిరెడ్డి, శ్రీధర్, జగదీష్, సంతోశ్, వినోద్, సంధ్య, విజయలక్ష్మి, గోవర్ధన్, నారాయణలతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల మంది ఉద్యోగులు హాజరయ్యారు.

గద్దర్ పాట అజరామరం

- భారత్ బచావో ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య


మాట్లాడుతున్న గాదె ఇన్నయ్య

హుజూరాబాద్: ప్రజా యుద్ధనౌక గద్దర్ పాట అజరామరమని భారత్ బచావో ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య అన్నారు. ప్రజాసంఘాల వేదిక ఆధ్వర్యంలో హుజూరాబాద్ అంబేద్కర్‌చౌరస్తాలో గద్దర్ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాకవి, గాయకుడు గద్దర్ భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన పాటలు ఎంతోమందికి ప్రేరణగా నిలిచాయని పలువురు వక్తలు స్మరించుకున్నారు. గాదె ఇన్నయ్య మాట్లాడుతూ.. గద్దర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా పోతాడని అన్నారు. గద్దర్ అంతిమయాత్రలోనే పాత్రికేయుడు, సంపాదకుడు జహీర్‌అలీ మృతిచెందడం ప్రజా ఉద్యమానికి తీరని లోటని అన్నారు. మతం పేరుతో ఉన్మాదులు దాడులు చేస్తూ దళితులు, బహుజనులు, మైనార్టీల హక్కులను కాలరాస్తున్న తరుణంలో గద్దర్, జహీర్ అలీ బతికి ఉండాల్సిందని అన్నారు. అనంతరం అరుణోదయ విమలక్క ఫోన్లో మాట్లాడారు. ప్రజా ఉద్యమాలు బతికి ఉన్నంతవరకు గద్దర్ బతికే ఉంటాడన్నారు. ప్రజా సంఘాల నాయకులు ఆవునూరు సమ్మయ్య, పలకల ఈశ్వర్‌రెడ్డి, వేల్పుల రత్నం, ముక్కెర రాజు, పాడిచెట్టి వెంకట్రాజం, అంతం లింగారెడ్డి, సదానందం, వెంకన్న, వేల్పుల ప్రభాకర్, కుమారస్వామి, ఇమ్మడి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయుల పోరాటాలు మరువలేనివి

చందుర్తి (వేములవాడ) : రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయుల పోరాటాలు మరువలేనివని గోపా రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల రమేశ్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిల్మ్ భవన్‌లో తెలంగాణ విద్యా చైతన్య వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర సాధనలో పోరాటాలు చేసిన ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. మండలంలోని ఎన్గల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అక్కపెల్లి యాదగిరిగౌడ్, మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, గౌడ శంఖారావం సంపాదకుడు శ్రీనివాస్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, పాల్గొన్నారు.

లౌకికశక్తులు ఏకమై బీజేపీని ఓడించాలి


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి(మానకొండూర్): మతోన్మాద బీజేపీని రాష్ట్రంలో నిలువరించాలంటే ప్రజాతంత్ర లౌకికవాదులు కమ్యూనిస్టులతో కలిసి పనిచేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బొమ్మనపల్లి, సుందరగిరి, గాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన చట్ల హన్మంతు, బెడిగం వీరవ్వ, కాశవేని ఎంకవ్వ, ధారవేని అనూష, కాల్వల రాజిరెడ్డిల కుటుంబాలను పరామర్శించారు. చిగురుమామిడిలోని ముస్కు రాజిరెడ్డి స్మారకభవనంలో మాట్లాడుతూ.. బీజేపీ నాయకత్వం తెలంగాణలో పాగావేసేందుకు అనేక కుట్రలు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఐదురాష్ట్రాల్లో త్వరలో జరుగనున్న ఎన్నికల్లో మతాన్ని రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చేందుకు కుయుక్తులు పన్నుతోందని వివమర్శించారు. గృహలక్ష్మి దరఖాస్తుకు రేషన్‌కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం అర్హులైన ప్రతీఒక్కరికి రేషన్‌కార్డులు జారీచేయాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు అందెస్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, చాడ శ్రీధర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, బూడిద సదాశివ, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, గోలి బాపురెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలి

కరీంనగర్: క్రాఫ్‌లోన్ చెల్లించిన వారికి రుణమాఫీ నగదు వేయడంలో జరిగిన గందరగోళ పరిస్థితులపై స్పష్టత ఇవ్వాలని చాడ వెంకట్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు ఫ్యాక్స్ ద్వారా లేఖ పంపారు. రైతులకు రుణమాఫీలో భాగంగా క్రాఫ్‌లోన్ తీసుకొని పూర్తిగా రుణాన్ని చెల్లించిన రైతులకు రుణమాఫీ చేసినట్లు ట్రెజరీ ద్వారా బ్యాంక్‌లో నగదు పడినట్లు ఫోన్‌కు మెసేజ్ రూపంలో సమాచారం వస్తుందని కానీ క్రాఫ్‌లోన్ కట్టిన వెంటనే సంబంధిత ఖాతా రద్దు చేయబడుతుందన్నారు. ఆ ఖాతాలో ఎలాంటి నగదు జమ కాలేదని బ్యాంకు అధికారులు తెలుపుతున్నారని అన్నారు. ఇలాంటి గందరగోళ పరిస్థితులు ఎందుకు జరుగుతున్నాయో సంబంధిత అధికారులకు కూడా తెలియకపోవడం అన్యాయంగా ఉందన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

సారంగాపూర్: ఆర్థిక ఇబ్బందులతో మండలంలోని పోతారం గ్రామానికి చెందిన దోసండ్ల రాజం (46) ఉరేసుకొని మృతిచెందాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాజం కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. సాయంత్రం కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య వెంకటి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భూమి కబ్జాకు యత్నిస్తున్నారని

- సర్పంచ్‌తో పాటు కుటుంబ సభ్యులపై కేసు


భూమిపత్రాలు చూపుతున్న నాగం రజిత

వేములవాడ రూరల్: భూమిని కబ్జాకు యత్నిస్తున్న సర్పంచ్‌తో పాటు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన సర్పంచ్ నాగుల వేణు అదే గ్రామానికి చెందిన నాగం రజితకు చెందిన పది గుంటల భూమిని సాగు చేసుకొని కబ్జా చేసేందుకు యత్నించాడు. నాగం రజిత తన భూమిలో వరినాటు వేయగా విషయం తెలుసుకున్న సర్పంచ్ వేణు, భార్య లావణ్య, తల్లి నర్సవ్వ ఆదివారం ఆమె వేసిన వరినాటును తొలగించారు. దీనిపై రజిత మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు విచారణ జరిపి సర్పంచ్‌తో పాటు కుటుంబ సభ్యులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. రజిత భర్త ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండగా అధికారంతో తన భూమిని కబ్జా చేసే యత్నిస్తున్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సర్పంచ్‌ను వివరణ కోరగా తాను ఎవరి భూమిని కబ్జా చేయడం లేదని, కావాలనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన తెలిపారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రబృందం

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మల్లాపూర్‌కు చెందిన నడిగొట్టు రాజేశం ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. రాజేశం మృతితో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. దుబాయిలో ఉన్న గ్రామానికి చెందిన వారాల లావణ్య నర్సింగం పటేల్ సొంతూరిపై ఉన్న మమకారంతో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం కోసం రూ.50 వేలు పంపించారు. గ్రామానికి చెందిన వారాల నర్సింగం మిత్రబృందం ఆదివారం బాధిత కుటంబానికి ఆర్థికసాయం అందజేశారు. ఇక్కడ వారాల నర్సింగం మిత్రబృందం సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఆకస్మికంగా అనారోగ్యంతో మృతిచెందిన గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ రేసు బాబు కుటుంబానికి సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. మండలకేంద్రానికి చెందిన రేసు బాబు అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబీకులను ఆదివారం పరామర్శించారు. కొప్పుల్లి రమేశ్, బుర్క ఎల్లం, కొత్త మల్లయ్య, జగన్, శ్రీను, రవి పాల్గొన్నారు.

మైనార్టీ మండలాధ్యక్షుడిగా శాదుల్లా


శాదుల్లాను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ముస్లిం మైనార్టీ కమిటీ మండల అధ్యక్షుడిగా షేక్ శాదుల్లా, గౌరవ అధ్యక్షులుగా మహమ్మద్ చాంద్‌పాషా, షేక్ అజీజ్‌లను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈమేరకు కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా షేక్ సాహెబ్, మహమ్మద్ రజాక్, మహమ్మద్ ఇర్ఫాన్, షరీఫ్, ఇమామ్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ధర్వేశ్, కోశాధికారిగా షేక్ గౌస్, సహాయక కార్యదర్శులు అహమ్మద్, గఫార్, అస్లమ్, యామిన్, లారీ హైమద్‌ను ఎన్నుకున్నారు.

సింగారంలో తాళం వేసిన ఇంట్లో చోరీ


పరిశీలిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడ్డారు. బీరువాలో దాసి ఉంచిన బంగారం, వెండిని ఎత్తుకెళ్లారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. సింగారం గ్రామానికి చెందిన గంగాధర నాగరాజు వ్యక్తిగత పనులపై శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సిద్దిపేటకు వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికొచ్చి చూసేసరికి తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా దొంగలు బీరువాను ధ్వంసం చేసి అందులో దాచి ఉంచిన రూ.70 వేల విలువ గల తులం బంగారం, 18 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. నాగరాజు ఫిర్యాదుతో పోలీసులు అక్కడికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి


అక్రమొద్దీన్ (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో పడి మృతిచెందాడు. ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. మండలంలోని కొండాపూర్‌కు చెందిన మహ్మద్ అక్రమొద్దీన్ (55) ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. అక్రమొద్దీన్ వేసిన వలలోనే చిక్కుకొని నీటిలో మునిగిపోయాడు. గట్టున ఉన్న వారు గమనించి కేకలు వేసేలోపే నీటిలో కనిపించకుండా పోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై శేఖర్‌రెడ్డి చెరువు వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు గాలించినా ఆయన ఆచూకీ లభించలేదు. సాయంత్రం కరీంనగర్ నుంచి గజ ఈతగాళ్లను తెప్పించారు. వారు తీవ్రంగా గాలించడంతో రాత్రి పొద్దుపోయిన తర్వాత అక్రమొద్దీన్ మృతదేహం లభించింది. వ్యవసాయం పనులు చేసుకునే అక్రమొద్దీన్‌కు భార్య గౌస్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఉపాధి కోసం కుమారుడు దుబాయి వెళ్లాడు.

బాలుడిపై వీధి కుక్కల దాడి


గాయపడిన విశ్వక్

సైదాపూర్(హుస్నాబాద్): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం అమ్మనగుర్తిలో ఆదివారం ఉదయం విశ్వక్(5)పై అనే బాలుడిపై వీధికుక్కలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన సర్జన శ్రీకాంత్–మమతల కొడుకు విశ్వక్ పక్కింటికి పాలు తెచ్చేందుకు వెళ్లాడు. సమీపంలో గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు బాలుడిపై దాడి చేశాయి. బాలుడి అరుపులు విని గ్రామస్తులు కుక్కలను తరిమేశారు. గాయపడిన బాలుడిని చికిత్సకోసం హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

చదువు కోసం వెళ్లి కానరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో మెట్‌పల్లి యువకుడి మృతి
- నాగ్‌పూర్‌లో ఘటన..


అబూబకర్ (ఫైల్)

మెట్‌పల్లి: ఆ యువకుడు చదువులో ప్రతిభావంతుడు. మహారాష్ట్రలోని పేరొందిన కళాశాలలో సీటు సాధించాడు. చదువు పూర్తయితే మంచి ఉద్యోగం వస్తుందని తల్లిదండ్రులు ఆశపడ్డారు. కానీ అంతలోనే రోడ్డు ప్రమాదం రూపంలో యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే... ఇస్లాంపురాకు చెందిన అహ్మద్‌కు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు అబూబకర్ (21) ఇంటర్ వరకు పట్టణంలోనే చదివాడు. తర్వాత నాగ్‌పూర్‌లోని ప్రముఖ కళాశాలలో ఇంజినీరింగ్‌లో సీటు సాధించాడు. శనివారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా అబూబకర్ అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఎదిగిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో గుండెలవిసేలా రోదించారు.

విద్యుత్‌షాక్‌తో గొర్రెలు మృతి

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామంలో విద్యుత్‌షాక్‌తో నాలుగు గొర్రెలు మృతిచెందినట్లు ఆదివారం గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన బర్రె లచ్చన్న తన గొర్రెలను మేపేందుకు గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ వైరు తెగిపడి తగలడంతో నాలుగు గొర్రెలు మృతిచెందాయి. తనకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. పరిహారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ట్రాన్స్‌కో ఏఈ జమీల్‌పాషా పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో వ్యభిచార ముఠా.!

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ ప్రాంతం బైపాస్ రోడ్డులోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ముఠాను అదుపులోకి తీసుకొని, విచారణ చేపట్టినట్లు పట్టణ ఎస్సై అబ్దుల రహీం తెలిపారు. కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా నిజామాబాద్, వరంగల్ నుంచి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం పట్టణ ఎస్సై రహీం ఆధ్వర్యంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు యువతులు, యువకుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై పేర్కొన్నారు.